క్లుప్తంగా

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): స్థానిక పాత బస్టాండ్ మున్సిపల్ పార్కులో సాధన చేస్తున్న తైక్వాండో క్రీడాకారులకు గురువారం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల మనోధైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉంటూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉండాలంటే క్రీడల్లో రాణించాలన్నారు. తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెడికోకు ఆర్థిక సాయం



మెడికో ప్రవీణ్‌బాబుకు చెక్కును అందిస్తున్న అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం విద్యార్థి ఎం.ప్రవీణ్‌బాబుకు ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సాయం అందించింది. గురువారం సాయంత్రం స్థానిక బీ క్యాంప్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు హరిదాస్ ఈరన్న మాట్లాడుతూ.. పే బ్యాక్ టు సొసైటీ పిలుపులో భాగంగా అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదువుతున్న ప్రవీణ్‌బాబుకు మెస్ చార్జెస్, హాస్టల్ ఫీజు, పుస్తకాలు, రికార్డులు తదితరాలకు సంబంధించి రూ.34,500 చెక్కును అందించామన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటాకు నివాళి



రతన్ టాటా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

కర్నూలు కల్చరల్: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం వీఆర్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటించారు. కర్నూలు యూనిట్ సభ్యులు రతన్ టాటా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. భరత మాత ముద్దుబిడ్డ దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించిన రతన్ టాటా అందరికీ స్ఫూర్తిదాయకమని సంస్థ కన్వీనర్ మనోహర్‌రెడ్డి అన్నారు. ఇలాంటి మేధావులను దేశం ఎప్పటికి మరిచిపోదని వారి సేవలను స్మరించుకుంటుందన్నారు. సభ్యులు హనుమంత రెడ్డి, శివారెడ్డి, చంద్రా రెడ్డి, మురళీధర్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, ప్రభాకర్, యుగంధర్, ఎరుకల హరి, సురేష్, భాష తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): తిరుపతి పట్టణంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. క్రీడాకారులు విశాల్, నవీన్, వెంకట శివరాం, కార్తీక్ వెండి పతకాలు, అఖిల్, మోహన్‌కుమార్, శ్యాంసుందర్ కాంస్య పతకాలు సాధించారు. నిర్వాహకులు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తైక్వాండో మాస్టర్ సతీష్‌కుమార్ అభినందించారు. స్థానిక కిడ్స్ వరల్డ్ పార్కు, ఏపీఎస్‌పీ క్యాంపు, స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు పతకాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ :
దేవర – 1, వెట్టయన్ – ది హంటర్
సత్యం సుందరం,స్వాగ్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ :
దేవర – 1, వెట్టయన్ – ది హంటర్
సత్యం సుందరం, రామ్‌నగర్ బన్నీ
జోకర్ : ఫోలీ ఎ డ్యూక్స్, దక్షిణకాళి,
మిస్టర్ సెలబ్రిటి
వెంకటేష్ సినీ కాంప్లెక్స్:
దేవర – 1,వెట్టయన్ – ది హంటర్, స్వాగ్,
శ్రీరామ: మార్టిన్ , **రాజ్:** సత్యం సుందరం
భరత్ కాంప్లెక్స్: బహిర్భూమి
విజయ థియేటర్: దేవర – 1
విక్టరీ టాకీస్: కలింగ

క్రీడా మెరికలు

- సత్తా చాటుతున్న బాలికలు
- ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మెరిసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ
- బరిలో దిగితే పతకాల పంట

కర్నూలు (టౌన్): క్రీడల్లో బాలికల ప్రాతినిథ్యం పెరిగింది. జిల్లా, నగర స్థాయిలో క్రీడాకారుల సందడి కనిపిస్తోంది. రెండేళ్ల కరోనా తరువాత చిన్నారులు, బాల బాలికలు క్రీడలపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మరోవైపు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల వైపు చిన్నారులను తల్లిదండ్రులు సైతం ప్రోత్సహిస్తున్నారు. కర్నూలు నగరంలో కరాటే, జూడో, తైక్వాండో వంటి కఠినమైన క్రీడల్లో బాలికలు ఆసక్తి ప్రదర్శించడం, పతకాలు సాధించడం, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ప్రస్తుతం నగరంలో ఏ క్రీడా పోటీ అయినా బాలురకు దీటుగా బాలికలు రాణిస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు, వ్యక్తిగత క్రీడలు, గుర్తింపు ఉన్న అసోసియేషన్ల క్రీడా పోటీల్లోను ప్రతిభ చాటుతున్నారు. తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. చదువుతో పాటూ క్రీడలపై దృష్టిపెట్టి రన్నింగ్, లాంగ్‌జంప్, ఫుట్‌బాల్ వంటి క్రీడాంశాల్లో నిత్య సాధన చేస్తున్నారు.

➢ఫుట్‌బాల్ మాణిక్యం



రేణుక (ఫుట్‌బాల్)

నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేణుక ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఫుట్‌బాల్ మీద మక్కువతో ప్రతి రోజు సాధన చేస్తోంది. మూడేళ్లుగా లక్ష్య ఫౌండేషన్‌లో ఉత్తమ శిక్షణ తీసుకుంటోంది. ఫుట్‌బాల్ క్రీడాంశంలో రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. 2023లో గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో, అలాగే గత నెల 24, 25 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 9వ తేదీ నుంచి ఢిల్లీలో జరుగనున్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటోంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి గుర్తింపు తెచ్చుకుంటానని పేర్కొంది.

➢పరుగులో పాల్గొంటే పతకమే

ఎనిమిదేళ్లుగా రన్నింగ్‌పై దృష్టి పెట్టి నిత్యం సాధన చేస్తున్న సుకన్య మంచి ఫలితాలు సాధిస్తోంది. 7వ తరగతి వరకు ప్యాలకుర్తిలో చదువుకుంది. ఇంటర్మీడియెట్ గూడూరు సాయి వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో చదువుకుంది. అప్పటి నుంచి సాధన చేస్తున్న ఈ క్రీడాకారిణి పరుగు పందెంలో ప్రతిభ చాటుతోంది. నగరంలోని బి.క్యాంపులో హాస్టల్ ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతోంది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో సత్తా చాటింది. అండర్ – 20 విభాగంలో కర్నూలు నుంచి ప్రాతినిథ్యం వహించిన ఆమె హెప్టాథ్లాన్‌లో బంగారు పతకం, రిలే విభాగంలో వెండి పతకం, హర్డిల్స్‌లో కాంస్య పతకం సాధించి శభాష్ అనిపించుకుంది.



సుకన్య (అథ్లెట్)



క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ క్రీడాంశంలో తలపడుతున్న క్రీడాకారులు

➢పతకాలు సాధిస్తున్న ప్రసన్న కుమారి



ప్రసన్న కుమారి (అథ్లెట్)

పరుగు పందెం పోటీల్లో ప్రసన్నకుమారి పతకాలు సాధిస్తూ అథ్లెటిక్స్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటోంది. గత నెల 6వ తేదీన జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో 800 మీటర్ల పరుగులో బంగారు పతకం, 1500 మీటర్ల పరుగులో బంగారు పతకం సాధించింది. ఇంటర్ పూర్తి చేసుకున్న ఈమె డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది.

ఆశావర్కర్ల వేతనాలు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): 2024 ఫిబ్రవరి 9వ తేదీన ఏపీ ప్రభుత్వం, సీఐటీయూ యూనియన్ నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఆశావర్కర్ల వేతనాలు పెంచాలని ఏపీ ఆశా వర్కర్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జే.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే ఆశా వర్కర్ల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచాలని, బదిలీలు చేపట్టాలని కోరారు. మరోవైపు ప్రభుత్వం డిమాండ్లను నెరవేర్చేలా ఒత్తిడి చేసేందుకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపాలని ఆశా వర్కర్లకు సూచించారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరులో అక్టోబర్ 15వ తేదీన జరిగే కాటి కాపరుల జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కాటికాపరి, గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌జీ కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బి.తిక్కన్న అధ్యక్షతన నిర్వహించారు. సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి ఎస్‌జీ కృష్ణ మాట్లాడుతూ.. శ్మశానాల్లో కాటి కాపరి వృత్తినే నమ్ముకొని ఉన్న వారికి సొంతిల్లు, పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. భయంకరమైన రోగాలు ప్రబలే అవకాశం ఉండడంతో హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఎస్.దేవసహాయం, పీఎస్ రాధాకృష్ణ, డి.విజయమ్మ, జయరాజు పాల్గొన్నారు.

రైతుబజార్లలో తనిఖీలు



అమీన్ అబ్బాస్ నగర్ రైతు బజారులో తనిఖీ చేస్తున్న ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని రైతుబజార్లను మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ టీమ్ తనిఖీ చేసింది. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి ఆధ్వర్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్నలతో కూడిన బృందం సీ.క్యాంపు, కొత్తపేట, అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజార్లలో తనిఖీలు జరిపింది. కూరగాయల ధరలు ఏ విధంగా ఉంటున్నాయి.. టమాట, ఉల్లిగడ్డలను ఏ ధరతో అమ్మకాలు సాగిస్తున్నారని పరిశీలించారు. టమాట కిలో రూ.42, ఉల్లిగడ్డలు రూ.36కు మించి అమ్మరాదని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి ఆదేశాలు ఇచ్చారు. రైతుబజార్లలో ఏర్పాటు చేసిన వంట నూనెల ప్యాకెట్ల పంపిణీ కేంద్రాలను పరిశీలించారు. నిర్ణయించిన ధరలకే అమ్ముతున్నారా? లేదా? అని ఆరా తీశారు.

13న దుర్గామాత విగ్రహాల నిమజ్జనం

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన దుర్గా మాత విగ్రహాలను ఈ నెల 13వ తేదీన నిమజ్జనం చేయనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ వెల్లడించారు. ఆయన గురువారం నిమజ్జన ప్రాంతమైన తుంగభద్రా నది ఘాట్‌ను సందర్శించారు. నిమజ్జన ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ ఏడాది నగరంలో సుమారు వంద విగ్రహాలు ప్రతిష్టించారని, 13న ప్రధాన కూడళ్ల మీదుగా సంకల్ బాగ్‌కు శోభాయాత్రగా విగ్రహాలు నిమజ్జనానికి తరలి రానున్నట్లు చెప్పారు. సాయంత్రం దుర్గా ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్లతో నిమజ్జనం జరుగుతుందన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. నదిలో ప్రవాహం ఉధృతంగా ఉందని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు దాశెట్టి శ్రీనివాసులు, జగన్, విట్టల్‌శెట్టి, మహాబలేష్, తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



మార్కెట్ యార్డు వద్ద నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో స్తంభించిన ట్రాఫిక్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. పాత మార్కెట్ యార్డు, కూరగాయల మార్కెట్‌కు మధ్య రెవెన్యూ కాలనీకి సంబంధించి రెండు రోడ్లు ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం పూట ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. దసరా పండగ నేపథ్యంలో ట్రాఫిక్ భారీగా పెరిగింది. 100 మీటర్ల మేర వెళ్లేందుకు గంట సమయం పట్టిందంటే ట్రాఫిక్ సమస్య ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది. మార్కెట్‌కు ఉల్లితో పాటు వ్యవసాయ ఉత్పత్తులు పోటెత్తుతున్నాయి. పండగ నేపథ్యంలో కూరగాయల మార్కెట్‌కు వినియోగదారులు భారీగా వస్తున్నారు. షాపింగ్‌కు వెళ్లడం కూడ పెరిగింది. దీంతో ట్రాఫిక్ పెరిగింది. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయలేక మార్కెట్ యార్డు సెక్యూరిటీ సిబ్బంది చేతులెత్తేశారు. ట్రాఫిక్‌లో వ్యవసాయ ఉత్పత్తులతో వచ్చే వాహనాలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు చిక్కుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మధ్యంతర భృతి చెల్లించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ఇచ్చేలోపు మధ్యంతర భృతి చెల్లించాలని ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అవుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఎస్టీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోవిందనాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు చేపట్టాలన్నారు. సంయుక్త కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ.. విద్యారంగం వినాశన దిశకు కారణమైన జీఓ 117ను తక్షణమే రద్దు చేసి, అశాస్త్రీయమైన సిలబస్ భారాన్ని ఉపాధ్యాయులపై తగ్గించాలన్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు బోధనేతర పనులను తగ్గించాలని కోరారు. ఉద్యోగులకు బకాయిలు పడిన మొత్తాన్ని చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఆ సంఘం నాయకులు పక్కీరయ్య, నందీశ్వరుడు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయిలో మెడల్స్, సర్టిఫికెట్లు సాధించిన క్రీడాకారులను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి గురువారం తన స్వగృహంలో అభినందించారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ –17 విభాగంలో బాల బాలికలు మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు సుగంధిని, లైక్యశ్రీ, కార్తీక, పవన్ వెంకటసాయి, ఇర్ఫాన్ అహ్మద్, రేవంత్‌లను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో జిల్లా తరపున పతకాలు సాధించడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలన్నారు. తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ బాధ్యతల స్వీకరణ



యశోదాబాయి

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్‌గా ఐఎఫ్ఎస్ ఆర్. యశోదాబాయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అటవీ శాఖలో ఇటీవల జరిగిన ఐఎఫ్ఎస్‌ల బదిలీల్లో భాగంగా కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్‌గా ఉన్న పి.రామకృష్ణను ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. అందులో భాగంగా మంగళగిరి ఆర్‌అండ్‌డీ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సుగా ఉన్న ఆర్.యశోదాబాయిని అనంతపురం సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఆమెకు కర్నూలు సర్కిల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కేరళ రాష్ట్రానికి చెందిన యశోదాబాయి 2010లో ఎఫ్ఎఫ్ఎస్‌కు ఎంపికైన ఆమె పలు చోట్ల డీఎఫ్‌ఓగా విధులు నిర్వహిస్తూ 2024 జనవరిలో కన్జర్వేటర్‌గా పదోన్నతి పొంది మంగళగిరి ఆర్‌అండ్‌డీ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సుగా పోస్టింగ్ పొందారు. కర్నూలు, నంద్యాల డీఎఫ్‌ఓలు శ్యామల, నాగమల్లీశ్వరి, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ సూర్య చంద్ర రాజు, ఎఫ్‌ఆర్‌వో రమణారెడ్డి, కర్నూలు డివిజన్ ఎఫ్‌ఆర్‌ఓ విజయ కుమార్, కర్నూలు సర్కిల్ ఏఓ అబ్దుల్ సుభాన్, తదితరులు నూతన సీఎఫ్‌కు బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు.

అన్నదానం

కల్లూరు: కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయము ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మాత విగ్రహం దగ్గర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, ఆలయ కమిటీ అధ్యక్షులు నాగమదిలేటి, గంగాధర్ భక్తులకు అన్నదానం చేశారు. వాసవీ నగర్‌లో దసరా పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.

మమ్మేలమ్మా.. దుర్గమ్మా



లలితా పీఠం వద్ద స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయంలో



సత్యసాయి మందిరంలో



నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయంలో



గీతా మందిరంలో అశ్వత్థ నారాయణ అలంకరణ



చిన్న అమ్మవారి శాలలో మహాకాళి అలంకరణ



రాజరాజేశ్వరిదేవి ఆలయంలో



రేణుకా ఎల్లమ్మ ఆలయంలో



బండిమెట్ట అంబా భవాని ఆలయంలో



సూర్యనారాయణ స్వామి ఆలయంలో

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు గురువారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని ఆలయాల్లో అమ్మవారిని దుర్గమ్మగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, హోమాలు, రథోత్సవం, పల్లకి సేవ, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. ఆధ్యాత్మిక నృత్యాలు, భక్తి సంగీత కచేరీలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రులపై సందేశాలు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



పెద్దమ్మ వారి శాలలో దుర్గామాత అలంకరణ



కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో



గోదా గోకులంలో



లలితా పీఠంలో హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు



సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో



నిమిషాంబ దేవి ఆలయంలో



నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో



రామారావ్ గేట్‌లో కొలువు దీరిన దుర్గమ్మ



బుధవార పేట కాళికాంబ ఆలయంలో



ఏక్యాంప్‌లో బొమ్మల కొలువు



భరత మాత ఆలయంలో



గోదాగోకులంలో



చిన్మయ మిషన్‌లో

ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు తగదు

కర్నూలు(సెంట్రల్): మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన యతిన ర్సింగానంద్‌పై చర్యలు తీసుకోవాని ముస్లిం మత పెద్దలు ముఫ్తి సయ్యద్ మన్సూర్‌అహ్మద్, సయ్యద్ షఫీ పాషాఖాద్రి, సయ్యద్ జాకీర్ అహ్మద్ రషాది, అబ్దుల్ రెహమాన్, సయ్యద్ మహ్మద్ పీర్, షేక్ జహంగీర్ తదితరులు కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. ఈ మేరకు గురువారం వారు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మహ్మద్ ప్రవక్తపై విద్వేష పూరిత ప్రసంగం చేసిన యతినర్సింగానంద్‌పై కేసు నమోదు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.


రతన్ టాటా మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్): ప్రముఖ పారిశ్రామికవేత్త, సేవాతత్పరుడు రతన్ టాటా మృతికి సీపీఐ జిల్లా సమితి తరపున సంతాపం తెలుపుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రతన్ టాటా దేశానికి ఎనలేని సేవచేశారని, టాటా గ్రూపు సంస్థల ద్వారా లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందారని, ఆయన మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

కర్నూలు (టౌన్): నగరంలోని జోహరాపురంలోని బీడీ క్వార్టర్స్ కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని సీపీఎం నాయకులు రాజశేఖర్, నబీరసూల్ విన్నవించారు. గురువారం స్థానిక నగరపాలక కార్యాలయంలో మేనేజర్ చిన్నరాముడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా కాలనీలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మానసిక దివ్యాంగుల హక్కులు పరిరక్షించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): అందరిలానే జీవించే హక్కు మానసిక వికలాంగులకు ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని మానసిక ఆరోగ్య వార్డును సందర్శించారు. అక్కడ ఉన్న మానసిక వికలాంగులకు యాపిల్ పండుల్ పంచిపెట్టారు. తదనంతరం అక్కడ ఉన్న మానసిక వికలాంగులను చూసుకునే తల్లిదండ్రులకు, ఇతర పరిచారకులకు మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తుల ఆరోగ్య సంరక్షణ హక్కు, ఆస్తి హక్కు మొదలైన వాటితో సహా మానసిక రోగుల హక్కులు, వైద్యచికిత్స అందించడం వంటి విధుల గురించి తెలియజేశారు. మానసిక వికలాంగుల హక్కులకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఏ విధమైన న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. మానసిక రోగులు, వికలాంగులకు చట్టపరమైన సేవలు పథకం –2015 గురించి తెలియజేశారు. వైద్య అధికారులు, మానసిక వికలాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఏఐఎస్‌ఎఫ్ మహాసభలు

ఆదోని సెంట్రల్: నవంబర్ 5,6 తేదీల్లో కర్నూలు జిల్లా 30వ మహాసభలను ఆదోని పట్టణంలో నిర్వహించనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు బి.గిడ్డయ్య తెలిపారు. పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా మహాసభల ఆహ్వానం సంఘం సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయన్నారు. పాఠ్యపుస్తకాల్లో శాస్త్రీయ భావాజలాన్ని తొలగించి అశాస్త్రీయ భావాలను చేర్చి విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. విద్యార్థులను జీవితాలను మెరుగు పరచాల్సిన ప్రభుత్వాలు అజ్ఞానంలోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, మేధావులు, వ్యాపారవేత్తలు సహకరించి ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించండి

మంత్రాలయం: ప్రసిద్ధ మంత్రాలయం క్షేత్రంలో భక్తుల ప్రాణాలు రక్షణ కరువైందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ ఆరోపించారు. తుంగ భద్ర నదీ తీరంలో భక్తుల పుణ్యస్నానాలకు రక్షణ కల్పించాలని డిప్యూటీ తహసీల్దార్ గురురాజ రావుకు వినతిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీమఠానికి హుండీలు, లాడ్జీల ఆదాయాలపై ఉన్న ఆసక్తి భక్తుల ఏర్పాట్లపై లేదని విమర్శించారు. శ్రీమఠంలో అడుగడుగునా హుండీలు పెట్టారుగానీ నదీ తీరంలో ఒక్క ఏర్పాటు లేదన్నారు. ఏటా భక్తులు నదీ తీరంలో పుణ్యస్నానాలకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా శ్రీమఠం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం చిక్‌బళ్లాపూర్ జిల్లాకు చెందిన సుబ్బరాయప్ప స్నానికి వెళ్లి నదిలో గల్లంతు కావడం శోచనీయమన్నారు. పార్టీ సహాయ కార్యదర్శి లక్ష్మన్న నాయక్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.